

హైదరాబాద్ సెంట్రల్ కోర్టులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు

## బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

- రిజర్వేషన్లు 42 శాతం పెంచాలి
- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- బీసీల ఐక్యతను దేశానికి చాటి చెప్పాలి
- మధుసూదనాచారి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : బీసీ కులగణన వెంటనే చేపట్టాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం హైదరాబాద్ సెంట్రల్ కోర్టులో 'బీసీల సమగ్ర కులగణన-స్థానిక ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు' అంశంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మండలి బీఆర్ఎస్ఎల్పీ నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీల ఐక్యతను దేశానికి చాటిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. కులగణన బీసీల హక్కు అని పేర్కొన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన మాటను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమకార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీసీలకు అన్యాయమే జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో వేల సంఖ్యలో బీసీ కులాలు ఉన్నాయని, వాటిలో ఎన్నో కులాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని పరిస్థితులను మనం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోగా బీసీ కులగణన పూర్తిచేయడంతో పాటు 42శాతం రిజర్వేషన్ల విధానం పాటించాలని, లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తమ హక్కులను కాపాడుకునేందుకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందేనని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సీఎం తమ్ముడికో న్యాయం సెబీ చైర్‌పర్సన్‌కో న్యాయమా?

**బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు • హిండెన్ బర్గ్ వెనుక కాంగ్రెస్? : ఏలేటి**

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): వ్యాపారాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడికి ఓ న్యాయం, సెబీ చైర్‌పర్సన్‌కు ఒక న్యాయమా? అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తన తమ్ముడైతే వ్యాపారాలు చేసుకోవద్దా? అని సీఎం అన్నారని, మరి సెబీ చైర్ పర్సన్ కంపెనీల షేర్లు ఎందుకు కొనొద్దని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి హిండెన్ బర్గ్ వార్తలపై తప్ప సెబీపై, సుప్రీంకోర్టుపై, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని మండిపడ్డారు. బ్లిట్జ్ పేపర్‌లో రాహుల్ గాంధీకి పెండ్లయిందని, పిల్లలున్నారని రాశారని చెప్పారు. హిండెన్ బర్గ్ రాసింది నిజమే అయితే బ్లిట్జ్ రాసింది కూడా నిజమేనా? అని ప్రశ్నించారు. ఒకవేళ తప్పయితే నోటీసులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. బ్లిట్జ్ పేపర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సిట్ వేస్తారా? అని సవాల్ విసిరారు. హిండెన్ బర్గ్ నివేదికకు కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చి రాజకీయంగా రచ్చ చేయడం చూస్తుంటే ఆ నివేదిక రూపకల్పనకు కాంగ్రెస్ సహకరించిందనే అనుమానం కలుగుతున్నదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు.

# ఖర్గేను కాదనలేక.. అదానీని అనలేక!

- ఈడీ ఆఫీస్ ముందు ధర్నాలో సీఎం తర్జన భర్జన
- అదానీని విమర్శించేందుకు నోరు రాని రేవంత్‌రెడ్డి
- సెబీ చైర్‌పర్సన్ రాజీనామా, బర్తరఫ్‌పైనే ఫోకస్
- సంబంధం లేకున్నా రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రస్తావన
- కేసీఆర్, కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలకే పరిమితం



హైదరాబాద్‌లో ఈడీ ఆఫీస్ ముందు ధర్నాలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అటు చూస్తే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం.. ఇటు చూస్తే అదానీతో 'పారిశ్రామిక' స్నేహం.. అటు ఖర్గేను, రాహుల్‌గాంధీని కాదనలేక, ఇటు అదానీని అనలేక సీఎం రేవంత్‌రెడ్డి సతమతమయ్యారు. హైదరాబాద్‌లో గురువారం ఈడీ ఆఫీస్ ముందు జరిగిన ధర్నాలో సీఎం ప్రసంగాన్ని చూస్తే ఇది అర్థం అవుతుంది. అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని, సెబీ చైర్‌పర్సన్ అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలన్న డిమాండ్లతో ఏఐసీసీ పిలుపుమేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొక్కుబడిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సంబంధం లేని ప్రసంగం చేయడంపై అటు రాజకీయ వర్గాలు, ఇటు కాంగ్రెస్ శ్రేణులు విస్మయం వ్యక్తం చేశాయి. అదానీపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి అవినీతి ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా అదానీ కంపెనీకి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెడ్ కార్పెట్ పరిచారు. దావోస్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి, ఫొటోలు దిగారు. రాష్ట్రంలో రూ.12,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పాతబస్తీలో కరెంటు బిల్లుల వసూలు బాధ్యతను అదానీకి అప్పగించారు. ఈ నిర్ణయాలపై ఎన్ని విమర్శలు వస్తున్నా వెనక్కి తగ్గడం లేదు. దీనిని బట్టే అదానీకి, రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న స్నేహం ఎంత బలమైనదో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**ఆలస్యంగా వచ్చిన అధ్యక్షుడు..**

ఏఐసీసీ ఆదేశం మేరకు ఈడీ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి దగ్గరుండి నేతృత్వం వహించాలి. కానీ కార్యక్రమం మొదలైన తర్వాత గంట ఆలస్యంగా సీఎం అక్కడికి వచ్చారు. ఉదయం 11.15 గంటలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ బృందం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటిలో కలిసింది. వారు వెళ్లిపోయిన తర్వాత ప్రముఖులెవరూ రాలేదు. అప్పుడు బయల్దేరినా ధర్నా ప్రారంభం అయ్యే సమయానికి సీఎం ఈడీ ఆఫీస్‌కు చేరుకునేవారని చెప్తున్నారు. కానీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సీఎం ఈడీ ఆఫీస్‌కు చేరుకున్నారు. పెద్దగా బిజీ షెడ్యూల్ లేకున్నా.. ఎందుకు ఆలస్యం చేశారన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతున్నది. పైగా కార్యక్రమం ప్రారంభమైన తర్వాత మంత్రులు, ఇతర ప్రముఖుల ప్రసంగాలు ముగిసినా సీఎం రాలేదు. దీంతో సమయం గడిపేందుకు కొందరు నేతలతో మాట్లాడించారని చెప్పుకుంటున్నారు.

**తూతూమంత్రంగా విమర్శలు**

ధర్నా ప్రధాన ఎజెండా.. అదానీ గ్రూప్ అవినీతి, సెబీ చైర్‌పర్సన్ పెట్టుబడులు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో తూతూ మంత్రంగా అదానీపై విమర్శలు చేయడం కొత్త అనుమానాలకు తావిస్తున్నది. సీఎం 5 నిమిషాలపాటు ప్రసంగించారు. ఇందులో ప్రధాన అజెండా అయిన అదానీ, సెబీ ఛైర్‌పర్సన్ అవినీతిపై మాట్లాడింది కేవలం నాలుగు నిమిషాలే. అందులోనూ అదానీ పేరును ఏడు సార్లు మాత్రమే తలచుకున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ రాజీనామా చేయాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వమే బర్తరఫ్ చేయాలన్నారే తప్ప.. 'అదానీ అవినీతిపై కేంద్రం విచారణ జరపాలి' అని డిమాండ్ చేయలేదని చెప్తున్నారు. మిగతా మంత్రులు, నేతలు అదానీపై ఎన్ని విమర్శలు చేసినా.. సీఎం మాత్రం ప్రధాన అజెండాను పక్కనబెట్టి తూతూమంత్రం విమర్శలకే ఎందుకు పరిమితం అయ్యారంటూ కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

**మళ్లీ అదే ఆవుకథ..**

సీఎం తన ప్రసంగంలో ఐదు నిమిషాలు మోదీ, అమిత్ షాను తిట్టడానికి కేటాయిస్తే, దాదాపు ఆరు నిమిషాలు జవహర్‌లాల్ నెహ్రూ నుంచి పీవీ వరకు కాంగ్రెస్ ప్రధానులను పొగడటానికి సరిపోయింది. మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీని దుష్టచతుష్టయంగా అభివర్ణించి.. నలుగురూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. హమ్ దో.. హమారే దో అన్నట్టుగా యావత్ ప్రపంచాన్ని దోచుకునేలా మోదీ, అమిత్‌షా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి బీజేపీ ముప్పులా మారిందన్నారు. దేశాన్ని ప్రధాని మోదీ అప్పుల ఊబిలో నెట్టారంటూ సందర్భం లేని వ్యాఖ్యలు చేశారు. ఇక.. ధర్నా అసలు ఉద్దేశం కన్నా బీఆర్ఎస్‌ను విమర్శించడానికి ఎక్కువ సమయం తీసుకున్నారు. దాదాపు 10 నిమిషాలపాటు కేసీఆర్, కేటీఆర్‌పై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో కొన్నిరోజులుగా చెప్తున్న ఆవుకథనే మళ్లీ చెప్పారు. రాజీవ్‌గాంధీ గొప్పదనాన్ని వర్ణించడంతోపాటు సచివాలయం ముందు ఆయన విగ్రహాన్ని పెడతామని, దమ్ముంటే తొలగించాలని, దాడులు చేస్తామని.. ఇలా పాత ముచ్చట్లే చెప్పుకొచ్చారు. అదానీని, అసలు విషయాన్ని పక్కనపెట్టి.. అనవసరంగా కేసీఆర్‌ను, కేటీఆర్‌ను ఎందుకు విమర్శించారో అక్కడికి వచ్చిన నేతలకు కూడా అర్థం కాలేదు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

**డబ్బులు ఉన్నాయి.. రైతులు రోడ్డెక్కొద్దు**

రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, రైతులు రోడ్డెక్కొద్దని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఏ రైతుకు రుణమాఫీ కాకపోయినా.. సమస్య ఉన్నా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. కలెక్టరేట్లల్లో అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేశారని, వారికి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఆయా సమస్యలను పరిష్కరించి రుణమాఫీ చేస్తారని తెలిపారు.



మురుగు కాలువలో లభ్యమైన చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న కార్మికుడు

## డ్రైనేజీలో గల్లంతైన చిన్నారి మృతి

### ఇంటికి కొద్ది దూరంలో మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, ఆగస్టు 22: ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి గల్లంతైన చిన్నారి మృతి చెందింది. ఇంటికి సమీపంలోనే మురుగు నీటిలో మృతదేహం లభించింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నందనగర్‌లో నివాసముండే బాలిక అను (2) బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ మురుగు కాలువలో పడి గల్లంతయింది. ఆనంద్‌నగర్ కాలనీ నుంచి కాలువలో గాలిస్తూ వెళ్లగా.. న్యాల్‌కల్ రోడ్డులోని పీఎఫ్ కార్యాలయం సమీపంలో చెత్తలో పాప మృతదేహం కనిపించింది. అప్పటిదాకా ముద్దులొలికే మాటలతో గడిపిన అను.. విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు పూజ, మారుతి గుండెలు బాదుకున్నారు. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


## రికార్డు స్థాయిలో మక్కల ధరలు

**క్వింటాకు రూ.2821**

కాశీబుగ్గ, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర రెండు నెలల క్రితం క్వింటాకు రూ.2790 పలకగా ఆ తర్వాత రేట్ తగ్గింది. మళ్లీ గతవారం రూ.2765కు చేరింది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా గురువారం క్వింటాకు రూ.2,821 ధర పలికినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన రైతు చిలుమురి మొగిలి 33 క్వింటాళ్ల మక్కలు తీసుకురాగా.. మాధవి ట్రేడర్స్ అడ్తి ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ ఖరీదు వ్యాపారి కొనుగోలు చేశారు.

## అదానీపై రేవంత్‌ది ద్వంద్వ వైఖరి

- రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలను రద్దు చేయాలి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ బహిరంగలేఖ



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అదానీ వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. అదానీ అవినీతిపై నిగ్గుతేల్చాలని ఈడీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ధర్నా నిర్వహించిందని, ఆయన సీఎం హోదాలో అదానీ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తు చేశారు. 2024 జనవరిలో రేవంత్‌రెడ్డి సర్కార్ డేటా స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ, సిమెంట్, డిఫెన్స్, ఏరో స్పేస్‌తో సహా వివిధ రంగాల్లో రూ.12,400 కోట్ల పెట్టుబడుల విషయంలోనే కాకుండా హైదరాబాద్‌లోని పాతబస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలుకు అదానీ గ్రూప్‌నకు అనుమతులు ఇచ్చిన విషయాలను ఎలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ దశలో అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. బీజేపీతో కుమ్మక్కు అయింది.. రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈడీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి నిరసన తెలిపారని పేర్కొన్నారు. అదానీ విషయంలో రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై తేల్చుకోవాలని ఆయన రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేకు సూచించారు. తక్షణమే అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీఎం శాఖిలో అక్రమాలు

- ఎస్సీ గురుకుల సొసైటీ ప్రమోషన్లలో నోట్ల దందా!
- డీఎల్ ప్రిన్సిపాల్ ప్రమోషన్లు, బదిలీల్లో అవకతవకలు
- జోన్లకు జోన్లే మార్చిన వైనం.. ఫోకల్ టు ఫోకల్ బదిలీలు
- డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ లేదా ఏసీబీ విచారణకు డిమాండ్
- తప్పులు జరిగితే రాసివ్వండి : సెక్రటరీ వర్షిణి

మ్యాకం రవికుమార్/హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ): 'అడిగినంత డబ్బు ముట్టజెప్పు.. కావాల్సిన ప్రమోషన్ పట్టు. నచ్చిన చోటుకు వెళ్లు' ఇదీ సీఎం రేవంత్‌రెడ్డి అజమాయిషీలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సొసైటీ పరిధిలోని డీఎల్ ప్రిన్సిపాళ్ల ప్రమోషన్లు, బదిలీల తీరు. అధికార పార్టీ నాయకుడు, యూనియన్ లీడర్, ఇద్దరు ఉన్నతాధికారులు, ఓ డాటా ఎంట్రీ ఆపరేటర్ చక్రం తిప్పి కోట్లు దండుకున్నారు. సమస్యలను చక్కదిద్దాల్సిన సెక్రటరీయే ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లకు సదరు వ్యక్తులతోనే రావాలని బాహాటంగా సూచించారు. వెరసి అనుభవం, అర్హతలున్నా ప్రమోషన్లు రాక కొందరు బలైతే, మరికొందరు స్థానికతనే కోల్పోయారు. ఈ వ్యవహారంపై సీఎస్‌కు ఫిర్యాదు చేసి 15 రోజులు దాటినా ఇప్పటికీ అతీగతీ లేదు.

**ఇష్టారాజ్యంగా డీఎల్ బదిలీలు**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలో మొత్తం 30 డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో 3 ప్రత్యేక డిగ్రీ కాలేజీలు మినహా 27 మహిళా డిగ్రీ కాలేజీల్లో మొత్తం 1017 మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం 2017, ఆ తర్వాత 2019లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టింది. తాజాగా 2022లో డీఎల్ పోస్టులు మంజూరు చేయగా, ఇటీవలే నియామకం చేపట్టింది. విధివిధానాలంటూ ఏమీలేకుండానే సొసైటీ ఇష్టారాజ్యంగా డీఎల్ బదిలీలు నిర్వహించింది. పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు సంబంధించి వేర్వేరుగా సూపరింటెండెంట్లను నియమించి బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టిన సొసైటీ, డీఎల్‌కు సంబంధించి అలాంటి చర్యలేమీ చేపట్టలేదు. కనీస అర్హతలు లేనివారిని ఇన్‌చార్జిలుగా నియమించి ప్రక్రియను మమ అనిపించింది. ఇదే అదునుగా సదరు ఉన్నతాధికారులు అక్రమాలకు తెరలేపారని తెలుస్తున్నది. వాస్తవంగా డిగ్రీ గురుకుల కాలేజీల్లో 2019 మార్చి, అదే ఏడాది ఆగస్టు, తాజాగా ఇటీవల నియామకాలు చేపట్టారు. 2019, 2020లో రిక్రూట్‌మెంట్ అయినప్పుడు మెరిట్ ప్రకారం ఆయా డీఎల్ సబ్జెక్టులకు సంబంధించి 80శాతం మంది వాళ్ల దగ్గరి ప్రాంతాల కాలేజీలను ఎంచుకున్నారు. కేవలం 20శాతం అంటే దాదాపు 170 మంది వరకు తమకు వచ్చిన మెరిట్ ఆధారంగానే దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఎంచుకోవాల్సి వచ్చింది. ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్న వారంతా రిక్వెస్ట్ బదిలీలు సైతం పెట్టుకున్నారు. ఇక 317జీవో కారణంగా మరికొద్దిమంది డిగ్రీ లెక్చరర్లు స్థానికతను కోల్పోయారు. వాస్తవంగా ఇక్కడ విషయం ఏమిటంటే మెరిట్ ఆధారంగా డిస్‌లొకేట్ అయినవారికి, 317జీవో బాధితులకు ఎక్కడా సంబంధం లేదు. ఒకరు మెరిట్ ఆధారంగా స్థానికతను కోల్పోతే, మరొకరు 317 జీవో కారణంగా స్థానికతను కోల్పోయారు. కానీ సొసైటీ మాత్రం ఇక్కడ వేర్వేరుగా పరిగణించకుండా 317, మెరిట్ ఫలితంగా డిస్‌లొకేట్ కేసులన్నింటినీ ఒకే ఘూటన కట్టి ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్లకు సీనియార్టీ లిస్ట్‌ను రూపొందించడం గమనార్హం. అభ్యర్థులు పెట్టుకున్న అప్లికేషన్లలోనే ఆర్‌ఎల్1, ఆర్‌ఎల్2 బ్యాచా? అపాయింట్‌మెంట్ ఎక్కడ? సొంత ప్లేస్ ఎక్కడనేది సర్టిఫికెట్ల ద్వారానే తెలుస్తుంది. అవేవీ చేయకుండా కామన్ సీనియార్టీ పేరిట అడ్డదారిలో వచ్చిన వారికి కోరుకున్న చోటుకు, కాలేజీకి నిబంధనలకు విరుద్ధంగా జోన్లకు జోన్లనే మార్చి పోస్టింగ్ ఇచ్చారు. అర్హతలున్నా కూడా అనేక మందిని దూరప్రాంతాలకు నెట్టేశారు. సొంత జోన్లలో ఉన్నవారిని ఇతర జోన్లకు పంపించారు. డిస్‌లొకేట్ అయినవారిని సొంత ప్రాంతాలకు పంపి న్యాయం చేయాల్సింది పోయి అన్యాయానికి గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. బాధిత అధ్యాపకులు ఇప్పుడు కన్నీటిపర్యంతమవుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్లు**

బదిలీల సంగతి అంటుంచితే డిగ్రీ గురుకుల కాలేజీల ప్రిన్సిపాళ్ల పోస్టుల ప్రమోషన్లలోనూ సొసైటీ పూర్తిగా నియమనిబంధనలకు పాతరేసింది. సొసైటీ 2020లో మొత్తంగా 19 డిగ్రీ ప్రిన్సిపాల్ పోస్టులను నోటిఫై చేసింది. వాటిలో 8 పోస్టులే భర్తీ అయ్యాయి. 11 పోస్టులు మిగిలిపోయాయి. తాజాగా ఆ పోస్టులతోపాటు అదనంగా మరో 6 పోస్టులు కూడా మంజూరుకాగా మొత్తంగా 17 పోస్టులు అందుబాటులోకి వచ్చాయి. సొసైటీ బైలాస్ ప్రకారం వీటిలో 30శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా, 70శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలి. ఇందుకు విరుద్ధంగా పూర్తిగా 100శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారానే సొసైటీ భర్తీ చేసింది. డీఎల్, ప్రిన్సిపాల్ పోస్టులను సీనియార్టీ ఆధారంగా నింపిన చరిత్ర సొసైటీలోనే కాదు, దేశ విద్యా వ్యవస్థలోనే ఎక్కడా లేదు. డీఎల్ పోస్టు బోధనకు సంబంధించినదయితే, ప్రిన్సిపాల్ పోస్టు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించింది. యూజీసీ గైడ్ లైన్స్ ప్రకారం 15 ఏండ్ల టీచింగ్ అనుభవం, పీహెచ్‌డీ, సమర్పించిన రీసెర్చ్ పత్రాలు తదితర అకడమిక్ ఫర్మార్మెన్స్ ఇండెక్స్ (ఏపీఐ) ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలి. ఇదే యూజీసీ గైడ్‌లైన్స్‌నే పాటించాలని అన్ని సొసైటీలకు తెలంగాణ ప్రభుత్వం 2019లో జీవో 15ను విడుదల చేసింది. కానీ సొసైటీ ఆ నిబంధనలన్నీ తుంగలో తొక్కిపెట్టి, అర్హతలను పరిశీలించకుండానే కేవలం కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించింది. ఇక్కడ మరో విషయం ఏమిటంటే సోషల్ వెల్ఫేర్‌లో మొత్తం మహిళా డిగ్రీ కాలేజీలే ఉన్నాయి. మహిళా గురుకులాల్లో మహిళా టీచర్లనే నియమించాలనే నిబంధన ఉన్నది. కానీ ఆ నిబంధనకు సొసైటీ పాతరేసింది. నోటిఫై చేసిన పోస్టులకు సంబంధించి రిజర్వేషన్లను కూడా ప్రమోషన్లలో కల్పించలేదు. అర్హులకు ఇచ్చారా? అంటే అదీ లేదు. సొసైటీ బైలాస్‌ను కూడా తుంగలోతొక్కి 100శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేశారు. అలా చేయాలంటే సంబంధిత మినిస్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ, మినిస్ట్రీ, ఇద్దరు ఎడ్యుకేషనలిస్ట్‌లు, రెండు యూనియన్ల మెంబర్లు, అక్కడున్న సీనియర్ మోస్ట్ ప్రిన్సిపాళ్లు ఇలా జీబీ మెంబర్లు కూర్చుని నిర్ణయాలు తీసుకుని తీర్మానించాలి. జీబీలో నోట్ చేసి ఆ తర్వాత చేపట్టాలి. ఆ మినట్స్ నోట్‌ను ప్రమోషన్ ఆర్డర్‌లో రెఫరెన్స్ ఐడీగా చూపాలి. కానీ అదేమీ లేకుండా సొసైటీ నిర్వహించింది. కేవలం డిపార్ట్‌మెంటల్ టెస్ట్, కామన్ సీనియార్టీ లిస్ట్‌ను ఫాలో అవుతున్నామని చెప్పి స్కూల్ ఎక్స్‌పీరియన్స్ వాళ్లను తీసుకొచ్చి డీఎల్ ప్రిన్సిపాళ్లుగా ప్రమోషన్ కల్పించడం గమనార్హం. ఈ తతంగం వెనుక పెద్దమొత్తంలో చేతులు మారాయని డీఎల్ అభ్యర్థులు వెల్లడిస్తున్నారు.

**చక్రంతిప్పిన అధికార పార్టీ లీడర్**

డీఎల్ ప్రిన్సిపాల్ ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించిన మొత్తం వ్యవహారంలో అధికారపార్టీకి చెందిన కీలక నాయకుడు, సొసైటీకి చెందిన ఓ యూనియన్ నాయకుడు, ఓడీల మీద పనిచేసిన ఇద్దరు ఉన్నతాధికారులు, డాటా ఆపరేటర్ అక్రమాలకు తెరలేపారని అధ్యాపకులే చెబుతున్నారు. ప్రమోషన్లకు సంబంధించిన ప్రక్రియే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం డీఎల్ ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ తీసుకున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ డిగ్రీ లెక్చరర్‌తో పాటు, మరో పీడీ నెల రోజుల పాటు ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకుండా సొసైటీ ప్రధాన కార్యాలయంలో నెల పాటు తిష్ట వేసి ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ లిస్ట్‌లను రూపొందించడం గమనార్హం. లక్షల్లో వసూలు చేసి డీఎల్ ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు, న్యూ నియామకాలు అన్నింటినీ చక్కబెట్టారని విశ్వసనీయ సమాచారం. అక్రమాల కోసమే ఎక్కడ ఎన్ని మంజూరు పోస్టులు, వేకెన్సీలున్నాయి? అనేవి స్పష్టంగా చూపించలేదు. సీనియార్టీ జాబితాలను మూడుసార్లకు మించి మార్చా రు. నచ్చిన వారికి, డబ్బు ముట్టజెప్పినవారికి ప్రమోషన్లు, బదిలీలు కల్పించేందుకు డాటా ఆపరేటర్‌ను అడ్డంపెట్టుకుని కావాలని క్లరికల్ మిస్టేక్స్‌కు పాల్పడ్డారు. అభ్యర్థుల వివరాలనే గోల్‌మాల్ చేయడం కొసమెరుపు. డీఎల్ ఒక్కటే కాదు జేఎల్, పీజీటీ, టీజీటీ బదిలీలు, ప్రమోషన్లలోనూ ఇదే తంతు కొనసాగిందని, ఒక్కో పోస్టుకు 5-10లక్షల వరకూ చేతులు మారాయని తెలుస్తున్నది. మొత్తంగా 5 కోట్ల మేర కుంభకోణం జరిగిందని సొసైటీ టీచర్లే బాహాటంగా ఆరోపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

**ఇదేమని అడిగితే బెదిరింపులు..**

బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన ప్రక్రియలో అన్యాయానికి గురైన టీచర్లు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నచ్చిన ప్లేస్‌కోసం ప్రమోషన్ వదులుకుంటే చివరికి ఆ చోటు దక్కక, ప్రమోషన్ కూడా చేజారి కన్నీటి పర్యంతమవుతున్నారు. అర్హతలుండి, మెరిట్ ఉండీ ప్రమోషన్లు రాక, జోన్లు ఎందుకు మారాయో తెలువక, అడిగితే చెప్పేవారు లేక, కుటుంబాలకు దూరమై మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఇదేమని అడిగితే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌పై సస్పెన్షన్ చేస్తామని సొసైటీ ఉన్నతాధికారులు బాధిత టీచర్లపై బెదిరింపులకు దిగడం గమనార్హం. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా ఎవరూ హెడ్ ఆఫీస్‌కు రావద్దని ఆంక్షలు విధించడమే కాకుండా అలా ఎవరైనా వస్తే సంబంధిత ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేస్తామని సెక్రటరీయే స్వయంగా ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న శాఖలో ఇంతగా అక్రమాలు జరుగుతున్నా ఎవరూ స్పందించకపోవడంపై టీచర్లు నిప్పులు చెరుగుతున్నారు. సీఎస్‌కు ఫిర్యాదు చేసినా, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసినా ఫలితం లేకుండా పోయిందని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లపై డిపార్ట్‌మెంట్‌కు చెందిన విజిలెన్స్, లేదంటే ఏసీబీతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సర్కారు స్పందించకుంటే మూకుమ్మడిగా తరలివచ్చి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని సోషల్ వెల్ఫేర్ గురుకుల టీచర్లు హెచ్చరిస్తున్నారు.

**తప్పులు జరిగితే రాసివ్వండి: సెక్రటరీ వర్షిణి**

ఇదే విషయమై సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణిని 'నమస్తే తెలంగాణ' సంప్రదించింది. అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై వివరణ కోరగా అలాంటిదేమీ లేదని ఆమె తెలిపారు. ప్రమోషన్లు, బదిలీలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టామని వివరించారు. తప్పులు ఎక్కడ జరిగాయో టీచర్లు చూపాలని, రాసివ్వాలని సూచించారు. కోర్టు ఆదేశాలతో సొసైటీకి పనిలేదని, సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ సొసైటీకి ఉన్నదని వెల్లడించారు.

## ఇవీ ఉదాహరణలు..

- డీల్ పిన్సిపాల్ ప్రమోషన్‌కు 15ఏళ్ల టీచింగ్ అనుభవముండాలి. కానీ పీజీటీగా సొసైటీలో పదేళ్లపాటు పనిచేసి దశాబ్దకాలం క్రితమే ఒకరు సొసైటీ హెడ్ ఆఫీస్‌లో ఓడీ పేరిట చేరారు. అక్కడే జేఎల్ ప్రమోషన్ తీసుకున్నారు. బోధన అనుభవం లేకుండానే మళ్లీ డీఎల్‌గా ప్రమోషన్ తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ డీఎల్ ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ పొందారు. ఇప్పుడైనా కేటాయించిన కాలేజీకి వెళ్లారా అంటే అదీలేదు. ఆ వెంటనే ఇప్పుడు మళ్లీ ఓడీ (ఆన్‌డ్యూటీ) ఆర్డర్‌ను తీసుకుని సొసైటీ ప్రధాన కార్యాలయంలో తిష్టవేయడం గమనార్హం.
- వరంగల్ ఈస్ట్‌కాలేజీలో కామర్స్‌కు సంబంధించి 5 పోస్టులు మంజూరు ఉన్నాయి. కానీ ఏడుగురికి పోస్టింగ్ ఇచ్చారు. హిస్టరీ లెక్చరర్‌ను ఎకనామిక్స్ చెప్పమంటున్నారు. అక్కడ పోస్టింగ్ తీసుకున్న తెలుగు టీచర్‌ను లైబ్రరీ చూసుకోమంటున్నారు.
- సిద్దిపేట కాలేజీలో ఎంపీసీఎస్ కోర్సు లేదు. అయినా మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్స్ కెమిస్ట్రీ వేకెన్సీ చూపెట్టారు. ముగ్గురు టీచర్లకు వర్క్‌లోడ్ లేదు.
- 2019లో రిక్రూటయి, మల్టీ జోన్1లో సర్వీస్ చేసిన ఓ అధ్యాపకురాలిని ఇప్పుడు వరంగల్ వెస్ట్‌కు బదిలీ చేశారు.
- ఉమ్మడి వరంగల్, జగిత్యాల, సంగారెడ్డి తోపాటు ఒకేరోజు రాత్రికి రాత్రే 35 మంది డీఎల్‌ల జోన్లను మార్చారు.
- జగిత్యాల అగ్రికల్చర్ కాలేజీలో పిల్లలు ఉన్నా అధ్యాపకులను నియమించలేదు.

## హెచ్‌పీసీ నిర్ణయంతోనే రీ డిజైన్

- పీసీ ఘోష్ కమిషన్ ఎదుట రిటైర్డ్ ఈఎన్సీ మురళీధర్
- సీడబ్ల్యూసీ గైడ్‌లైన్స్ ప్రకారమే డిజైన్ల రూపకల్పన
- 2డీ, 3డీ మోడల్ స్టడీస్ నిర్వహించాం: సీడీవో రిటైర్డ్ ఈఎన్సీ

హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ): హైపవర్ కమిటీ (హెచ్‌పీసీ) నిర్ణయం మేరకే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీ డిజైన్ చేశామని విశ్రాంత ఈఎన్సీ మురళీధర్ పునరుద్ఘాటించారు. జస్టిస్ ఘోష్ కమిటీ ఎదుట గురువారం మరోసారి హాజరైన ఆయన పలు విషయాలను వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వాములైన ఇంజినీర్ల విచారణ గురువారమూ కొనసాగింది. ప్రాజెక్టు రీడిజైన్‌పై ఇప్పటికే పలు ప్రశ్నలను సంధించిన కమిషన్ మరోసారి అందుకు సంబంధించిన అంశాలపైనే వివరాలను సేకరించింది. రీ డిజైన్ ఎలా? ఎప్పుడు, ఏ విధానం ద్వారా చేశారు? మారిన ప్రాజెక్టు ఆయకట్టు ఎంత? బరాజ్‌లకు టీఏసీ అనుమతులు ఎప్పుడు లభించాయి? తదితర అంశాలపై మురళీధర్‌ను కమిటీ ప్రశ్నించింది. ఈ సందర్భంగా ప్రతి ప్రశ్నకూ సూటిగా, ఎలాంటి తడబాటు లేకుండానే రిటైర్డ్ ఈఎన్సీ మురళీధర్ బదులిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, కాంతనపల్లి, దుమ్ముగూడెం ప్రాజెక్టుల్లో సవాళ్ల పరిష్కారానికి గత ప్రభుత్వం 2014 జూలై 22న హైపవర్ కమిటీని నియమించిందని, ఆ మేరకు జీవో 10ని జారీ చేసిందని గుర్తుచేశారు. ఆ కమిటీ సూచనలతో సవాళ్ల పరిష్కారానికి రీ డిజైన్లు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 11 డైరెక్టరేట్లు, టీఏసీ అనుమతులు వచ్చాయని తెలిపారు. మురళీధర్ చెప్పిన అంశాలన్నింటినీ కమిషన్ రాతపూర్వకంగా తీసుకున్నది.

**సీడబ్ల్యూసీ గైడ్‌లైన్స్ ప్రకారమే డిజైన్లు**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లను రూపకల్పన చేసిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) రిటైర్డ్ ఈఎన్సీ నరేందర్‌రెడ్డిని గురువారమే జస్టిస్ ఘోష్.. క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. డిజైన్లకు సంబంధించి నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన అఫిడవిట్లలోని అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రాజెక్టు రూపకల్పన, సర్వేలు, లోకేషన్ల ఎంపికలో సీడీవో పాత్ర ఏమీ లేదని నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యాప్కోస్ సర్వే, లోకేషన్ల ఎంపిక పూర్తయిన తర్వాత డిజైన్ల కోసం వచ్చారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సందర్శించి సైట్ కండిషన్లను పరిశీలించాక, హైడ్రాలజీ, జియో ఇన్వెస్టిగేషన్ నివేదికలు వచ్చాక, 2డీ స్టడీస్ తర్వాతే డిజైన్లను రూపొందించామని తెలిపారు. 3డీ స్టడీస్ రిపోర్టు అంశాలు, డిజైన్లు సరిపోలాయని తెలిపారు. ఫీల్డ్ ఇంజినీర్లు బాధ్యత వహిస్తామని ఒప్పుకున్న తర్వాతే డిజైన్ల చెక్‌లిస్ట్‌పై సంతకాలు చేశామని తెలిపారు. డిజైన్ల అంశాలపై ఎప్పటికప్పుడు ఎల్అండ్‌టీ ఏజెన్సీ ప్రతినిధులు సమ్మతించాకే ఆమోదించామని స్పష్టంచేశారు. షూటింగ్ వెలాసిటీ అంచనాలకు అనుగుణంగా డిజైన్లను రూపొందించకపోవడం వల్లే బరాజ్‌లోని 2 పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయంటే తాను అంగీకరించబోనని నరేందర్‌రెడ్డి తేల్చిచెప్పారు. రాఫ్ట్ కింద ఒక చోట ఇసుక కొట్టుకుపోవడం వల్లే ఇది జరిగి ఉంటుందని తెలిపారు. అయితే రాఫ్ట్ మొత్తాన్ని పూర్తిగా ఓపెన్ చేసి పరీక్షించి నిర్ధారించాల్సి ఉంటుందని, ఇదే విషయమై డిజైన్లు రూపకల్పన చేసిన ఇంజినీర్‌గా సెక్రటరీకి, ఏజెన్సీకి లేఖలు కూడా రాశానని స్పష్టం చేశారు.

## భర్త బతికుండగానే డెత్ సర్టిఫికెట్

**ఇంటి జాగ విక్రయించి భార్య ఘరానా మోసం • ఆపై 478 (ఏ) కింద కేసు**

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 22: భర్త బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని.. అతని పేరిట ఉన్న ఇంటి జాగను అమ్ముకుని.. తిరిగి అతనిపైనే వేధింపుల కింద కేసు వేసింది ఓ భార్య. ఇందుకు సంబంధించిన ఫొటోలు స్థానికంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన మాలోత్ వినోద్‌కు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గుమ్మడివెల్లికి చెందిన నిర్మలతో 2008లో వివాహం జరిగింది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తి 2013లో అక్కడి పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల చట్టం 498 (ఏ) కింద కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు విషయంలో తిరుగుతున్న వినోద్.. ఇటీవల వరంగల్ కోర్టులో ప్రాక్టీస్ చేసే ఒక లాయర్‌ను సంప్రదించాడు. వినోద్ తరఫు లాయర్ వివరాలు సేకరించగా విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. 2013 మార్చిలోనే నిర్మల వినోద్ మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నది. అదే ఏడాది సెప్టెంబర్‌లో 498 (ఏ) ఫిర్యాదు చేసింది. 2021లో వినోద్ పేరిట ఉన్న 150 గజాల భూమిని సైతం ఇతరులకు విక్రయించింది. ఈ ఘరానా మోసంపై బాధితుడు కాజీపేట పోలీసులను ఆశ్రయించగా.. ఇది ఇక్కడి అంశం కాదని, నేరం జరిగిన దగ్గర ఫిర్యాదు చేయాలని సూచించారు. సాక్ష్యాలు చూసి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బాధితుడి తరఫు లాయర్ తెలిపారు. ఈ విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డిని సంప్రదించగా బాధితుడు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని వివరించినట్టు తెలుస్తున్నది.